## క్లుప్తంగా

### బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం



కలెక్టర్ నారాయణరెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న ఆలయ చైర్మన్

**కందుకూరు:** మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీచీకటి వేంకటేశ్వరస్వామి దేవాలయ బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ చైర్మన్ మొకరాల రాజశేఖర్‌శర్మ బుధవారం కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. దేవాదాయశాఖ మంత్రి సురేఖ ప్రభుత్వ పరంగా ఉత్సవాలు నిర్వహించడానికి అంగీకరించారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు జరిగేలా ఆదేశాలు జారీ చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు.

### శ్రీవారి హుండీ లెక్కింపు



నగదును లెక్కిస్తున్న సిబ్బంది

**మీర్‌పేట:** జిల్లెలగూడ శ్రీ మత్స్యావతార వేంకటేశ్వర స్వామి దేవాలయ హుండీని బుధవారం ఆలయ కార్యనిర్వహణ అధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. 12 డిసెంబరు 2024 నుంచి జనవరి 22 వరకు ఆదాయం రూ.2 లక్షల 91 వేల 356 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో కార్పొరేటర్ రాజేందర్‌రెడ్డి, మాజీ ధర్మకర్తలు యాదగిరి ముదిరాజ్, జ్ఞానేశ్వరచారి, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

### రేపు మెగా జాబ్ మేళా

**మహేశ్వరం:** నియోజకవర్గ నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు శుక్రవారం మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సబితారెడ్డి ఆధ్వర్యంలో మండల పరిధి మన్సాన్‌పల్లి చౌరస్తాలో నిర్వహించే జాబ్ మేళాకు సుమారు 20 మల్టీ ఇంటర్నేషనల్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు. ఇందులో సుమారు 3వేల ఉద్యోగాలు ఉన్నాయని, ఎంపికైన వారికి నెలకు రూ.15 వేల నుంచి రూ.60 వేల వరకు జీతం ఉంటుందని వివరించారు. 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకొని, 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు గలవారు అర్హులని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

### ఆరు గ్యారంటీలను అమలు చేయాలి

బీజేపీ నాయకులు



సూపరింటెండెంట్ పద్మశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

**మహేశ్వరం:** అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీ భరోసా పథకాలను వర్తింపచేయాలని బీజేపీ జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు యాదిష్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయంలో సూపరింటెండెంట్ పద్మశ్రీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేయాలని సూచించారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి యాదయ్య గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు మాధవచారి, సీనియర్ నాయకుడు దేశ్యా నాయక్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సుదర్శన్ యాదవ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రావన్ పాల్గొన్నారు.

### బారికేడ్లు ఏర్పాటు చేయాలని వినతి



సీఐకి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

**కందుకూరు:** కందుకూరు నుంచి యాచారం వెళ్లే రహదారిపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నివారణకు బారికేడ్లు లేదా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరుతూ యూత్ కాంగ్రెస్ నాయకుడు బొమ్మకూరి ప్రశాంత్ తదితరులు బుధవారం స్థానిక పీఎస్‌లో సీఐ సీతారామ్‌కు వినతిపత్రం అందించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

# ఆందోళన వద్దు.. అర్హులకే పథకాలు

- గ్రామసభలో అధికారులు, ప్రజాప్రతినిధులు
- లబ్ధిదారుల జాబితా ప్రదర్శన, కొత్తగా దరఖాస్తుల స్వీకరణ



మహేశ్వరం: మాణిక్యమ్మగూడ గ్రామసభలో మాట్లాడుతున్న తహసీల్దార్ సైదులు

**మహేశ్వరం:** ఆందోళనలు వద్దు.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని తహసీల్దార్ సైదులు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మాణిక్యమ్మగూడ గ్రామంలో లబ్ధిదారుల అర్హుల జాబితా ఎంపికపై రెండోరోజు గ్రామసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరించి, వాటిని పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. జాబితాలో పేర్లు రానివారు గ్రామసభల్లో మరోసారి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

**పేర్లు లేవని..**

జాబితాలో పేర్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందొద్దని, మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ శైలజ సూచించారు. బుధవారం రెండోరోజు మండల పరిధిలోని మహేశ్వరం, నందుపల్లి గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో అర్హుల జాబితాను ప్రకటించారు. జాబితాలో తమ పేర్లు లేవని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

**కందుకూరులో..**

**కందుకూరు:** మండల పరిధిలో అధికారులు 11 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. దెబ్బడగూడ, జైత్వారంలో ఎంపీడీఓ సరిత, బైరాగిగూడ, లేమూరులో తహసీల్దార్ గోపాల్, కటికపల్లి, కొత్తూర్‌లో ఎంపీఓ గీత, సార్లరావులపల్లి, ఆకులమైలారంలో ఏఈ సతీష్, చిప్పలపల్లి, మురళీనగర్‌లో ఏపీఓ రవీందర్‌రెడ్డి, జబ్బార్‌గూడలో ఎంఏఓ లావణ్య ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో అర్హులైన వారికి ఇల్లు, రేషన్ కార్డుల లిస్టులో పేర్లు లేవని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పేర్లు లేనివారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు ఈ సందర్భంగా సూచించారు.

**ముగిసిన వార్డు సభలు**

**పహాడీషరీఫ్:** జల్‌పల్లి మున్సిపాలిటీలో బుధవారంతో మొత్తం 28 వార్డు సభలు ముగిశాయి. కమిషనర్ బి.వెంకట్రామ్ పర్యవేక్షణలో తొలిరోజు 13 వార్డు సభలు నిర్వహించగా, రెండోరోజు 15 సభలలో రేషన్ కార్డులకు ఆమోదం తెలిపారు. శ్రీరాం కాలనీకి సంబంధించిన 17, 19 వార్డులలో ఫీల్డ్ ఆఫీసర్లతో కలిసి కౌన్సిలర్లు ఎనగండ్ల ప్రశాంతి, పల్లపు శంకర్, వాదే ముస్తఫాకు చెందిన 21, 22 వార్డులలో కౌన్సిలర్లు షేక్ ఫమిదా అఫ్జల్, సపూద్ అవల్గీ, 9వ వార్డులో కౌన్సిలర్‌గా ఉన్న చైర్మన్ అబ్దుల్లా సాది, 10వ వార్డులో శంషూద్దీన్, 2, 5, 6, 9, 14, 15, 23, 26, 27, 28 వార్డులలో సజావుగా సభలు జరిగాయి. ఈ సందర్భంగా రేషన్ కార్డులు రానివారు కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. సభలలో నాయకులు షేక్ జహంగీరుద్దీన్, యూసుఫ్ పటేల్, పందెం కొండల్ యాదవ్, నవీన్ గౌడ్, మన్న రవికుమార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: జైత్వారంలో గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



పహాడీషరీఫ్: శ్రీరాంకాలనీ సభలో వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

### సభలు విజయవంతం



దరఖాస్తులు స్వీకరిస్తున్న మేయర్ పారిజాత

**బడంగ్‌పేట్:** బాలాపూర్‌లోని 15, 16, 17, 18 డివిజన్లు, అదేవిధంగా బడంగ్‌పేటలోని 32, 20, 23, 30, 29, 21, 22 1, అల్మాస్‌గూడలోని 2, 3, 4, 5, 24, 25, 26 డివిజన్‌లలో రేషన్‌కార్డుల దరఖాస్తుల స్వీకరణతో పాటు ప్రభుత్వం అందజేస్తున్న ఇతర పథకాలపై అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పలు డివిజన్‌లలో జరిగిన సభల్లో మేయర్ పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ పి.సరస్వతి, కార్పొరేటర్లు పాల్గొన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేయనివారి కోసం బడంగ్‌పేట కార్పొరేషన్‌లో స్పెషల్ వింగ్‌ను ఏర్పాటు చేస్తున్నామని, అక్కడ కూడా అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### అర్హులందరికీ ఇళ్లు, రేషన్‌కార్డులు ఇవ్వాలి



రేషన్‌కార్డు దరఖాస్తులు స్వీకరిస్తున్న కార్పొరేటర్ సురేఖ

**మీర్‌పేట:** అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు రేషన్‌కార్డులు ఇవ్వాలని మీర్‌పేట కార్పొరేషన్ 39వ డివిజన్ కార్పొరేటర్ సురేఖరమేష్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం డివిజన్‌లోని మినీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన వార్డు సభలో ప్రజల నుంచి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల దరఖాస్తులను కార్పొరేటర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేదలు అధికంగా నివాసముండే జిల్లెలగూడ ప్రాంతంలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ పథకాలు అందేలా అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డు అధికారి నర్సింహ పాల్గొన్నారు.

### ‘చింతల’కు సన్మానం



రవీందర్‌యాదవ్‌ను సన్మానిస్తున్న మహేశ్వరం నియోజకవర్గ నాయకులు

**మహేశ్వరం:** అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన చింతల రవీందర్‌యాదవ్‌ను సంఘం మహేశ్వరం నియోజకవర్గ నాయకులు బుధవారం ఆయన నివాసంలో కలిసి శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఇటీవల జైపూర్‌లో జరిగిన అఖిల భారత యాదవ మహాసభలో రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా రవీందర్‌యాదవ్ ఎన్నికయ్యారు. గ్రామాల్లో యాదవ సంఘాల బలోపేతం కోసం అందరూ కృషి చేయాలని రవీందర్ యాదవ్ సూచించారు. ఆయనను కలిసిన వారిలో యాదవ సంఘం రాష్ట్ర కార్యదర్శి మర్పల్లి అంజయ్య యాదవ్, నియోజకవర్గ అధ్యక్షుడు మేకల కృష్ణ యాదవ్, నాయకులు ఎల్గపల్లి నారాయణయాదవ్, ఎనుగుల అనిల్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, బాల్‌రాజ్ యాదవ్ అంజయ్యయాదవ్, అనిల్‌యాదవ్ పాల్గొన్నారు.

### కందుకూరుకు రూ.1.63 కోట్ల నిధులు మంజూరు

**కందుకూరు:** మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్ పని చేస్తున్నారని, ఆయన చొరవతో కందుకూరు మండలానికి రూ.1.635 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరయ్యాయని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 14 గ్రామాల్లో సీసీరోడ్లు, భూగర్భ డ్రైనేజీ నిర్మాణాలకు నిధులు కేటాయించారని చెప్పారు. సరస్వతిగూడకు రూ.9లక్షలు, లేమూరుకు రూ.20 లక్షలు, బైరాగిగూడకు రూ.9.50 లక్షలు, తిమ్మాపూర్‌కు రూ.9 లక్షలు, మాదాపూర్‌కు రూ.10.50 లక్షలు, ఆకులమైలారంకు రూ.9.50 లక్షలు, మీర్‌ఖాన్‌పేటకు రూ.10.50 లక్షలు, ముచ్చర్లకు రూ.9.50 లక్షలు, దెబ్బడగూడకు రూ.11 లక్షలు, కందుకూరుకు రూ.19 లక్షలు, నేదునూరుకు రూ.14 లక్షలు, బాచుపల్లికి రూ.9.50 లక్షలు, పులిమామిడికి రూ.9 లక్షలు, పెద్దమ్మతండాకు రూ.13.50 లక్షల నిధులు మంజూరయ్యాయని పేర్కొన్నారు. నిధులు మంజూరు చేసినందుకు ప్రజల తరఫున సీఎం రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎల్‌ఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**పహాడీషరీఫ్:** జల్‌పల్లి వాదే హుదా సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు బస్తీలలో గురువారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని పహాడీషరీఫ్ ఏఈ ఎల్.వి. సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. క్యూబా కాలనీ, మహ్మద్‌నగర్, న్యూ మహ్మద్‌నగర్, అలీనగర్‌లలో సరఫరా నిలిపివేయనున్నామని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

**హుడాకాంప్లెక్స్‌లో..**

**హుడాకాంప్లెక్స్:** మరమ్మతుల కారణంగా గురువారం పలు కాలనీల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డివిజినల్ ఇంజినీర్ కె.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ శివం హిల్స్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 11కేవీ ఆదర్శనగర్ ఫీడర్ కింద ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11కేవీ సరూర్‌నగర్, పుష్పగార్డెన్స్, నేతాజీనగర్, కమలానగర్, హుడాకాంప్లెక్స్, డెంటల్ కళాశాల, నర్సింహపురికాలనీ ఫీడర్ల పరిధి కాలనీల్లో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, 11కేవీ లెక్చరర్స్ కాలనీ, మదర్ డెయిరీ ఫీడర్ల పరిధి కాలనీల్లో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నామని ఆయన పేర్కొన్నారు.

### సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

**బడంగ్‌పేట్:** కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. అలాగే5వ డివిజన్‌లోని వినాయకహిల్స్ కాలనీ, రామిడిహిల్స్, 9వ డివిజన్‌లోని గ్రీన్‌హోమ్స్ కాలనీ, బాలాపూర్‌లోని 16, 17 డివిజన్‌లలోని తదితర కాలనీల్లో మేయర్ చిగురింత పారిజాత స్థానిక కార్పొరేటర్‌లతో కలిసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంసీఆర్ కాలనీ అధ్యక్షుడు అరుణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ నాయక్, కోశాధికారి దివ్య వేణుగోపాల్, యూత్ ప్రెసిడెంట్ వివేక్, మాజీ అధ్యక్షుడు సురేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# అందరికీ ఆమోదయోగ్యంగా ఉండాలి

**చేవెళ్ల:** అందరికీ ఆమోద యోగ్యమైన, అభివృద్ధి కాంక్షించే మున్సిపాలిటీగా చేవెళ్లను తీర్చిదిద్దాలి కానీ.. రాజకీయ లబ్ధికోసం స్వరూపం లేని మున్సిపాలిటీ ఏర్పాటు సరైందికాదని బీజేపీ మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డిలు అన్నారు. మండల కేంద్రంలో బుధవారం బీజేపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్ల మండల కేంద్రానికి సరిహద్దులుగా ఉన్న కందవాడ, పలుగుట్ట, పామెన, మల్లారెడ్డిగూడ గ్రామాలను వదిలేసి దూరంగా ఉన్న ఊరేళ్ల, రామన్నగూడ గ్రామాలను కలపటంపై ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. చేవెళ్ల పార్లమెంట్, అసెంబ్లీ కేంద్రం కాబట్టి అభివృద్ధి చెందే పెద్ద మున్సిపాలిటీగా ఉండాలని బీజేపీ కోరుకుంటుందన్నారు. గతంలో చేవెళ్ల మున్సిపాలిటీని 12 గ్రామాలతో ఏర్పాటు చేస్తున్నట్లుగా అధికారులు నివేదికలు పంపినట్లుగా చెప్పారు. కాని ఇప్పుడు కేవలం 8 గ్రామాలతోనే మున్సిపాలిటీ ఏర్పాటు చేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. చేవెళ్లలో బీజేపీ బలోపేతం అవుతుండడంతో.. కొంత మంది రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసం ఇలా చేయడం సరికాదన్నారు. భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని చేయాలని, ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, అధికార పార్టీ పెద్దలు ఆలోచన చేసి చేవెళ్ల మున్సిపాలిటీని 12 గ్రామాలతో కలిపి పెద్ద మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు ప్రవీణ్‌రెడ్డి, పి.శ్రీకాంత్‌రెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

### విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్, స్టేషనరీ

**షాద్‌నగర్‌రూరల్:** ఫరూఖ్‌నగర్ మండలం కుందేలుకుంట తండా పరిధిలోని పోతురాజుగడ్డతండా ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు బుధవారం శంకర్‌పల్లి మండలం మోకిల తండాకు చెందిన లింబ్యానాయక్ స్పోర్ట్స్ డ్రెస్, షూస్, ఐడీ కార్డు, టై, బెల్టు, స్టేషనరీ అందజేశారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో దాత లింబ్యానాయక్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుదర్శన్, రాములు, అంగన్‌వాడీ టీచర్ కవిత, గ్రామపెద్దలు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



రావిర్యాలలో వెంచర్ గేటుకు చైన్‌తో తాళం వేసిన నిర్వాహకులు

# ఎల్లమ్మ భక్తులకు ఇక్కట్లు

- వెంచర్ గేట్ తెరవని రియల్టర్లు
- ఆలయానికి చేరుకోవడాని భక్తుల ఇబ్బంది

**తుక్కుగూడ:** జిల్లాలో అతిపెద్ద ఆలయాల్లో రావిర్యాల శ్రీ సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం ఒకటి. ఈ ఆలయానికి ప్రతి మంగళవారం జిల్లా నలుమూలలతో పాటు, గ్రేటర్ హైదరాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి వేలాంది మంది భక్తులు వస్తుంటారు. దేవాలయానికి చేరుకోవడానికి ఉన్నది ఒకే ఒక మార్గం రావిర్యాల గ్రామం నుంచి. ఈ రోడ్డు పూర్తిగా సింగల్ రోడ్డు కావడం, రావిర్యాల పెద్ద చెరువుకు ఆనుకొని ఉండటంతో నిత్యం మరమ్మతులకు గురవుతుంది. సింగల్ రోడ్డు కావడంతో భక్తులకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. నెహ్రూ ఔటర్ సర్వీస్ రోడ్డు నుంచి ఆలయానికి చేరుకోవచ్చు. ఈ మధ్యలో ఉన్న హెచ్‌పీఆర్ వెంచర్ రోడ్డు నుంచి రావాలి. కానీ వెంచర్ నిర్వాహకులు గేట్ తెరవకపోవడంతో భక్తులు ఇక్కడి నుంచి రావడానికి ఇబ్బంది పడుతున్నారు. నిబంధనల ప్రకారం.. వెంచర్ వేసిన మూడేళ్ల అనంతరం రోడ్డును ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంది. కానీ.. పదేళ్లు కావస్తున్నా రోడ్డును ప్రజలు వినియోగించుకోకుండా గేట్‌కు తాళం వేసుకుంటున్నారు. ఇదే విషయమై.. పలువురు కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారని బీజేపీ ఫ్లోర్ లీడర్ వై.శివకుమార్ తెలిపారు. పుర అధికారులు స్పందించి త్వరగా గేట్ ఓపెన్ చేసి, భక్తుల కష్టాలు తీర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

# ‘అలకానంద’ ఆస్పత్రిని మూసివేయాలి

### వైద్యులు, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలి: ఏఐవైఎఫ్

**హుడాకాంప్లెక్స్:** నిబంధనలకు విరుద్ధంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లకు పాల్పడిన సరూర్‌నగర్ డాక్టర్స్ కాలనీలోని అలకానంద మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా సమితి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆస్పత్రి వద్ద నిర్వహించిన ధర్నాలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌లు మాట్లాడుతూ.. ఆస్పత్రి యాజమాన్యం 9 పడకలకు అనుమతి పొంది, 30 పడకలను అక్రమంగా నిర్వహిస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు జరిగితే కాని స్పందించరా అని ప్రశ్నించారు. ఈ హాస్పిటల్‌ను సీజ్ చేయడంతో పాటు, ప్రత్యేక విభాగాన్ని నియమించి రాష్ట్రంలోని ప్రైవేటు ఆస్పత్రులను సోదాచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.సత్యప్రసాద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆర్.బాలకృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి మధు, పి.శివకుమార్, సహాయ కార్యదర్శి వీరేష్, వెంకటేశ్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు



# పరిమిత వేగం.. సురక్షితం

- రోడ్డు నిబంధనలు తప్పనిసరి
- ఎంపీడీఓ సరిత
- జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు

**కందుకూరు:** జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలు– 2025లో భాగంగా బుధవారం ఎంఈఓ నరసింహ ఆధ్వర్యంలో కందుకూరు చౌరస్తాలో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి బ్యానర్లు, ప్లకార్డులతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సరిత మాట్లాడుతూ.. రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు కచ్చితంగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు హెల్మెట్ ధరించాలని, ఫోర్ వీలర్లు నడిపే వారు సీటు బెల్టు పెట్టుకోవాలని చెప్పారు. పరిమిత వేగంతోనే వాహనాలు నడపాలని, జీబ్రా క్రాసింగ్ వద్ద పాదాచారులు రోడ్డు దాటాలని పేర్కొన్నారు. మద్యపానం సేవించి రోడ్డుపై వాహనాలు నడపకూడదని, బాలబాలికలకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. అర్హులైన వారందరూ తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని స్పష్టంచేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సైదులు, హెచ్‌ఎం అంజయ్య, పీడీ స్వామి, శేఖర్, సీఆర్పీ వెంకటేశ్, ఎంఆర్సీ ఉద్యోగులు, నోబుల్, శ్రీచైతన్య పాఠశాలల కరస్పాండెంట్లు కొండల్‌రెడ్డి, వెంకటేశ్, విద్యార్థి సంఘాల నాయకుడు వినోద్‌చారి, విద్యామయి, ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, నోబుల్, శ్రీచైతన్య పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



కందుకూరు కూడలిలో విద్యార్థుల మానవహారం